క్లుప్తంగా

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంటు ఏసీ విజయ

సింగరాయకొండ: పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ సూచించారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి తగు సూచనలు ఇచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జనార్ధన్, సీఐ ఎం శివకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని సేలంవారిపల్లిలో కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నల్లమడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు కుమ్మినేని మురళి, పిడతల శ్రీకాంత్ సహకారంతో వీటిని అందజేశారు. స్టడీ మెటీరియల్ అందజేసిన పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బారావు, సుబ్బరాయుడు, నాగినేని తిరుపతయ్య, నరసయ్య, వెంకట్రావు అభినందించారు

నేడు తెలుగు బాప్టిస్ట్ చర్చి వార్షిక వేడుకలు

పొన్నలూరు: స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి మూడవ వార్షిక వేడుకలు గురువారం నిర్వహించనున్నట్లు రెవరెండ్ పాస్టర్ చుండి ప్రభాకర్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే వేడుకల్లో ముఖ్య అతిథిగా విశాఖపట్నంకు చెందిన పాస్టర్ ఎం స్టీఫెన్‌బాబు పాల్గొని వాక్యోపదేశం చేస్తారని విశ్వాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించొద్దు

సింగరాయకొండ: పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణించడం నేరమని, ఆటోల్లో నిబంధనల ప్రకారం ప్రయాణించాలని ఎస్సై బి.మహేంద్ర వ్యవసాయ మహిళా కూలీలకు సూచించారు. స్థానిక ఊళ్లపాలెం రోడ్డులో బుధవారం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

ద్విచక్ర వాహనదారులు హ్యాండిల్ లాక్ వేయాలి

కొండపి: రాత్రిళ్లు వీధుల్లో పార్క్ చేసే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హ్యాండిల్ లాక్ వేయాలని ఎస్సై ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిళ్లు వీధుల్లో హ్యాండిల్ లాక్ వేయని 20 ద్విచక్ర వాహనాలను రాత్రిపూట బీట్ నిర్వహించే పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారని, ఎస్పీ సూచన మేరకు ద్విచక్ర వాహనదారులను స్టేషన్‌కు పిలిపించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనదారులు ఎప్పుడూ ధ్రువీకరణ పత్రాలు వెంట పెట్టుకోవాలన్నారు. ఏఎస్సై అంకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నీచ రాజకీయాలు విడనాడాలి

కనిగిరిరూరల్: మహనీయులపై నీచ రాజకీయాలను చేస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కేంద్ర మంత్రి అమిత్ షా అనైతిక వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. బుధవారం కనిగిరిలో ఆయన ఒక సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఇటువంటి వారిని రాజ్యాంగ పదవిలో ఉండటం ఏమాత్రం సరైనది కాదన్నారు.

పశువుల షెడ్ పనులు వేగవంతం చేయాలి

హనుమంతునిపాడు: పశువుల షెడ్ల పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎఫ్ఏలు, టీఏలకు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు మాట్లాడుతూ మండలంలో 14 సచివాలయాల పరిధిలో 22 క్యాటిల్ షెడ్స్ మంజూరయ్యాయని, వాటిలో 18 గ్రామాల్లో మాత్రమే పనులు ప్రారంభించారన్నారు. ఒక్కో షెడ్ నిర్మాణానికి ఉపాధి నిధుల నుంచి రూ.2.30 లక్షల ఇస్తుందన్నారు. పండ్ల తోటల సాగుకు 62 ఎకరాల్లో మంజూరు కాగా వాటిలో 35 ఎకరాల్లో మాత్రమే పండ్ల తోటల మొక్కలు నాటారన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కల్పన ఊసేది..?

- నిరుద్యోగులకు ఆరు నెలలుగా నిలిచిన శిక్షణ
- ప్రభుత్వ తీరుపై నిరుద్యోగుల ఆగ్రహం
- జిల్లాల మార్పులతో శాఖాపరమైన సమస్యలు

కందుకూరు రూరల్:

ఆరు నెలల పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో తీవ్రంగా వైఫల్యం చెందింది. అసత్య హామీలతో గద్దెనెక్కాక ప్రజలకు చుక్కలు చూపిస్తోంది. ఎన్నికల సమయంలో ఇది చేస్తాం.. అది చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నిరుద్యోగులను అన్ని విధాలా మోసం చేశారు. ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి పక్కన పెడితే కనీసం ఉపాధి కల్పనకు ఇచ్చే శిక్షణను ప్రారంభించకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు.



శిక్షణా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు, ఫర్నీచర్

పట్టించుకునేదెవరు..?

కందుకూరులోని డ్వాక్రా బజారులో భవనంలో ఉపాధి కల్పన , ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ (ఎస్ఈఈడీఏపీ), దీన దయాళ్ ఉపాధ్యాయ - గ్రామీణ కౌశల్యయోజన (డీడీయూ–జీకేవై) గ్రామీణాభివృద్ధి సంస్థ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. పదో తరగతి ఆపై చదువులు చదివిన నిరుద్యోగులు, మధ్య చదువు నిలిపివేసిన వారిని గుర్తించి అడ్మిషన్లు చేసుకుంటారు. వారికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. కమ్యూనికేషన్స్ స్కిల్ వంటి వాటిపై సుమారు మూడు లేదా నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తారు. మార్కెట్‌లో ఉన్న కంపెనీలకు అవసరమైన విధంగా నైపుణ్యం నేర్పించడం, మార్కెటింగ్, రిటైల్ విభాగంలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించే బాధ్యత శిక్షణ కేంద్రం నిర్వాహకులు తీసుకుంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నో వందల మందికి ఈ ఈ కేంద్రం ద్వారా శిక్షణ ఇచ్చి వారు వివిధ రంగాల్లో రాణించేలా చేశారు. ఈ కేంద్రంలో మహిళలు, పురుషులకు ప్రత్యేక వసతి గృహాలుఉన్నాయి. కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, రిటైల్ అండ్ సేల్స్ విభాగాల్లో ప్రత్యేక శిక్షకులు, హాస్టల్ వార్డెన్, ఇతర సిబ్బంది ఉంటారు. అంత ప్రాధాన్యం ఉన్న ఈ కేంద్రం ప్రస్తుతం మూతపడింది. వసతులు ఉన్నా సరైన సిబ్బంది లేకపోవడం, డీఆర్‌డీఏ అధికారుల నిర్వాకం కారణంగా శిక్షణ కేంద్రం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది.

నిరుపయోగంగా శిక్షణ కేంద్రం

సుమారు ఆరు నెలల నుంచి అడ్మిషన్లు లేకపోవడంతో ఈ శిక్షణ కేంద్రం నిరుపయోగంగా మారింది. కేంద్రంలో ఉండే కంప్యూటర్లు, ఫర్నీచర్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. విలువైన మంచాలు, బెడ్లు వాడుకలో లేకపోవడంతో పాడైపోయే అవకాశం ఉంది. కనీసం తలుపులు తెరిచేవారే లేకపోవడంతో కేంద్రంలోని విలువైన పరికరాలు పనికిరాకుండా పోయేలా ఉన్నాయి.



కేంద్రం బయట పడేసి ఉన్న ఇన్వెర్టర్, పాడైన బ్యాటరీలు

నిరుద్యోగులకు లేని భరోసా...

ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు భరోసా లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులను డ్వాక్రా మహిళల ద్వారా, ఉపాధి హామీ పథకంలో వంద రోజు పూర్తయిన కుటుంబాల్లోని నిరుద్యోగులను గుర్తించి వారికి ఈ కేంద్రంలో ఉపాధి అవకాశాలకు శిక్షణ ఇస్తారు. ఒక బ్యాచ్‌కు సుమారు 70 మంది వరకు శిక్షణ పొందే అవకాశం ఉంది. శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు కచ్చితంగా వారికి ప్లేస్‌మెంట్ చూపించే బాధ్యత వారే తీసుకుంటారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి శిక్షణ కేంద్రంపై దృష్టి సారించడం లేదు.



బయట ఉన్న బోర్డు లోపల ఓ పాత గోడకు ఏర్పాటు

వేధిస్తున్న సిబ్బంది కొరత

కేంద్రంలో ప్రస్తుతం కేవలం ఒక కంప్యూటర్ శిక్షకులు మాత్రమే ఉన్నారు. మిగిలిన స్పోకెన్ ఇంగ్లిష్, రిటైల్ శిక్షకులు, మహిళా వార్డెన్, స్వీపర్, ఇతర సిబ్బంది కొరత ఉంది. కో ఎడ్యుకేషన్ కావడంతో కచ్చితంగా మహిళా సిబ్బంది ఉండాలి. అంతకముందు పని చేసిన వారు మానేశారు. దీంతో డీఆర్‌డీఏ నుంచి సిబ్బందిని నియమించాల్సి ఉంది. అంతే కాకుండా కందుకూరు ప్రకాశం జిల్లా నుంచి పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు వెళ్లింది. అయినప్పటికీ కేంద్రాన్ని ప్రకాశం జిల్లా వారి ఆధీనంలో ఉంది. ప్రస్తుతం నెల్లూరు జిల్లా డీఆర్‌డీఏ వారు మాకు కేంద్రాన్ని అప్పగించాలన్ని ఉన్నతాధికారులకు పలు మార్లు విన్నవించారు. నెల్లూరు జిల్లాలో రిటైల్ ఉద్యోగాలకు మంచి డిమాండ్ ఉంది. కేంద్రం మాకు అప్పగిస్తే నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాల కల్పిస్తామని నెల్లూరు డీఆర్‌డీఏ అధికారులకు చెప్తున్నారు.

> **త్వరలో ప్రారంభిస్తాం:**
> త్వరలో ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తాం. ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా కింద ఉన్న ఈ కేంద్రాన్ని పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు అప్పగించాలని కోరాం. ఈ జిల్లాలో ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఉన్నతాధికారులో మాట్లాడి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
> హైమావతి, నెల్లూరు జిల్లా జాబ్స్ మేనేజర్...

భూ సమస్యలు పరిష్కరించుకోండి

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ఆర్కేపల్లి, అగ్రహారం గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ మంజునాథరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 15 అర్జీలు రాగా, ఆన్‌లైన్ చేయాలని, సరిహద్దుల కోసం వచ్చాయి.

హనుమంతునిపాడు: మండలంలోని కొండారెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 7 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలని 7, దేవాలయానికి సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, సర్పంచ్ కలుకూరి దేవకరుణమ్మ, కార్యదర్శి షేక్ సఖీలా, మహిళా పోలీస్ లక్ష్మి, ఎంపీటీసీ రుద్రపాటి శోభ, వీఆర్వో, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



కాకుటూరివారిపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు



సీఎస్‌పురం: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

పామూరు: భూ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. మండల పరిధిలోని మోపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

టంగుటూరు: రైతుల భూ సమస్యలు వేగంగా పరిష్కరించాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని సూరారెడ్డిపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. చిన్న చిన్న సమస్యలకు రైతులు ఘర్షణకు పాల్పడకుండా వెంటనే పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో 30 అర్జీలు స్వీకరిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్, ఆర్ఐ, వీఆర్‌ఓ పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తులపై మస్టర్ వేస్తే క్రిమినల్ కేసు

- డ్వామా పీడీ జోసెఫ్ కుమార్

మద్దిపాడు: ఉపాధి హామీ పథకంలో మరణించిన వ్యక్తుల పేర్లపై మస్టర్ వేస్తే ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌పై క్రిమినల్ కేసులు నమోదు పెడతామని డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక స్త్రీశక్తి భవనం వద్ద బుధవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో మండలంలోని 21 పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో 569 పనులకు రూ.7.57 కోట్లు చెల్లించామన్నారు. అందులో కూలీలకు వేతన రూపంలో రూ 7.43 కోట్లు, మెటీరియల్ రూపంలో 13.56 లక్షలు చెల్లించారన్నారు. కూచిపూడిలో గ్రామానికి సంబంధించి విచారణ చేపట్టే క్రమంలో నెల్లూరు జిల్లాలో ఓ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎం నరేంద్ర పేరుతో కూచిపూడిలో ఉపాధి పనిచేసి నిధులు డ్రా చేసినట్లు విచారణలో తేలింది. అలాగే పలు సంతకాలు, వేలి ముద్రలు లేకుండా బిల్లులు చెల్లించినట్లు తెలిసింది. మండలంలోని రామాయపాలెం గ్రామానికి చెందిన



ఏపీఓ వెంకట్రావుపై మండిపడుతున్న డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్.

నరసింహ 2019లో మృతి చెందాడు. అయితే 2023లో ఉపాధి పనిచేసి, రూ.9600 నగదును డ్రా చేసినట్లు విచారణలో బయటపడింది. ఈ విషయపై పీడీ జోసెఫ్ కుమార్ స్పందించి మండలంలో చనిపోయిన వ్యక్తుల పైర్లపై జాబ్‌కార్డు ఉండి, నిధులు డ్రా చేసినట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. చనిపోయిన వ్యక్తులు గుర్తించి వారిపేర్లు తొలగించాలని మళ్లీ ఇలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని, వళ్ల దగ్గరపెట్టుకొని పనిచేయాని సిబ్బందిని ఆదేశించారు. శ్రీరామ్, యల్లమంద పేర్లతో మస్టర్లు వేయకుండా

నిధులు డ్రాచేసినట్లు గ్రామసభ వెల్లడించారు. అలాగే వేమవరం గ్రామంలో పని ప్రదేశంలో నేమ్ బోర్డులులేవని, పనిచేసిన నగదు ఇవ్వలేదని, 6 రోజులు పనిచేస్తే 3 రోజులకు మాత్రమే నగదు చెల్లించారచి గ్రామసభలో చదివి వినిపించారు. మండలంలోని చిలంకూరు గ్రామంలో పండ్లతోటల పెంపకం, క్యాటిల్‌షెడ్, సీసీరోడ్లకు సంబంధించిన పనులు జరిగిన ప్రదేశంలో తప్పక నేమ్‌బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. ప్రతిపాదనలు వేయకుండా పనుల చేశారని, కొలతల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. మండలంలోని చిమట గ్రామంలో మంజుల అనే ఆశా వర్కర్ ఉపాధి పనిచేసినట్లు గుర్తించారు. పలు గ్రామాల్లో వేలిముద్రలు లేకుండా బిల్లులు డ్రాచేసినట్లు, కొలతల్లో తేడాలు ఉన్నట్లు, పనిచేయకుండా పనిచేసినట్లు నగదు దుర్వినియోగం అయినట్లు ప్రజావేదికలో వెల్లడైంది. ఆయన వెంట ఏపీడీ లలితకుమారి, వెంకటస్వామి, ఎంపీడీఓ జగదీష్, ఎస్ఆర్‌పీ సీఆర్ఎన్ శర్మ, ఏపీఎం గడ్డం రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగండి

మద్దిపాడు: మండలంలోని 21 పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజాప్రతి నిధులు, అధికారులతో సమన్వయంగా పనిచేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీఓ జగదీష్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామాల సుస్థిరత అభివృద్దే లక్ష్యంగా మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పారిశుధ్యంపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని వైద్యాధికారి వీరబాబు అన్నారు. ప్రభుత్వ వైద్యాధికారి వీరబాబు, ఈఓఆర్డీ సాంబశివరావు, ఏఈ జాలయ్య, షుఖూర్‌లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ .రంగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అందరూ కలిసికట్టుగా



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పనిచేయాలన్నారు. ఆర్థిక వనరులు సమీకరణకు అన్ని శాఖల అధికారులు పనిచేయాలన్నారు.

కొండపి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామాంజనేయులు వివిధ శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు రచించాలన్నారు. తహసీల్దార్ మురళి, ఇతర శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి



వావిలేటిపాడుతో రైతులకు సూచనలిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పొగాకు తోటల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. వావిలేటిపాడు, జరుగుమల్లి, దావగూడూరు, చింతలపాలెం, చిరుకూరపాడు, కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాల్లో పొగాకు తోటలను పరిశీలించారు. కొన్ని పొగాకు తోటల్లో కలుపు ఎక్కువగా ఉందని, కూలీలతో లేదా యాంత్రి పద్ధతుల్లో కలుపుతీసుకోవాలన్నారు. క్షేత్రాధికారి ఉపేంద్ర, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దద్దాల నారాయణ, పక్కన నేతలు

జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ

కనిగిరిరూరల్: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈ నెల 21న నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహిద్దామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్షేమాన్ని అందించిన సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా నియోజకవర్గంలో 4 వేల మంది మహిళలకు చీరల పంపిణీ, రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, ఓకేరెడ్డి, ఒమేగా రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రారెడ్డి, భువనగిరి వెంకటయ్య, కటికల వెంకటరత్నం, వై శ్రీనివాసరెడ్డి, పల్నాటి భాస్కర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు పులి శాంతి, గోవర్ధన్ రెడ్డి, మాణిక్యరావు, ఎల్ తిరుపతిరెడ్డి, జి ఆదినారాయణరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ జయరాంరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, సర్పంచ్‌లు వెంకటరావు, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, స్వర్ణ ఏడుకొండలరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ చాంద్‌బాషా, కో ఆప్షన్ రహీం, పులి వెంకటేశ్వర రెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు చింతం శీను, దేవరాజు, పులి శీను, డాక్టర్ రసూల్, బాలాజీ, పవన్, ఏ కృష్ణారెడ్డి, గురు ప్రసాద్, నాయకులు నాని, రవీంద్రారెడ్డి, కొండారెడ్డి, వి.రాజశేఖర్ రెడ్డి, మూలే రాజశేఖర్ రెడ్డి, మితికల గురవయ్య, గౌస్ బాషా, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

- జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు

పొన్నలూరు: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని చౌటపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి ఈ–క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించి రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. మైక్రో ఇరిగేషన్ పరికరాల కోసం రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఏడీఏ నిర్మాలాకుమారి, ఏఓ పూర్ణచంద్ర రావు, వ్యవసాయ సహాయకులు సుప్రజ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.



చౌటపాలెంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు

క్రీస్తు అంటే విశ్వాసం, నమ్మకం



సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆదిమూలపు సురేష్

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో సెమీక్రిస్మస్ వేడుకలు

సింగరాయకొండ: క్రీస్తు అంటే విశ్వాసం, నమ్మకం, ప్రేమ, క్షమాగుణం, ప్రేమించటం, ఆదరించడం ఆయన నైజమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు తనను తగ్గించుకుని మానవాళికి గొప్ప సందేశం ఇచ్చేందుకు పశువుల పాకలో జన్మించాడన్నారు. వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ అని, ఏసు సందేశం ప్రకారం ప్రతి ఒక్కరూ అణగిమణిగి ఉండి పేదల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. రానున్న నాలుగేళ్ల పాటు పేదల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు సురేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. తరువాత క్యాండిల్ వెలిగించి క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పార్టీ నాయకులు బత్తిన మదన మనోహర్‌రావు, మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసరావు, పుట్టావెంకట్రావు, చింతపల్లి హరిబాబు, తాండ్ర రామ్మూర్తి, పాడిబండ్ల నాగేశ్వర రావు, మాదాల శంకర్, రాపూరి ప్రభావతి, చుక్కా కిరణ్‌కుమార్, చొప్పర కిరణ్, సోమిశెట్టి సురేష్, గాదంశెట్టి గుప్తా, గాలిబుజ్జి, చొప్పర వెంకన్న, పీవీ రెడ్డి, షేక్ అల్లాఉద్దీన్, చుండి శ్రీను, పాస్టర్లు మిడసల ఫిలోమెన్, మిడసల అశోక్, కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక కౌలుకు పొలాలు తీసుకోవద్దు

కొండపి: కొండపి బోర్డు పరిధిలోని నేతివారిపాలెంలో బుధవారం రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అధిక వర్షపాతం నమోదైతే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొగాకులో అన్య పదార్థాలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆకు రాల్చేటప్పుడు మొక్క కింది భాగంలో గడ్డి కలుపు మొక్కలు కలవకుండా ఉంచాలన్నారు. పొగ మల్లె సమూలంగా నిర్మూలించేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. ఐటీసీ కంపెనీ మేనేజర్ రత్నం, జీపీఐ కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు, పోలిశెట్టి కంపెనీ మేనేజర్ రామాంజనేయులు, బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ సాగర్ మాట్లాడుతూ పొగాకు పంట నియంత్రణ దాని ఆవశ్యకత గురించి వివరించారు. అధిక కౌలుకు భూములు తీసుకొని నష్టపోవద్దని సూచించారు. ముందుగా గ్రామంలోని పొగాకు పంటను, బ్యారెన్లను పరిశీలించారు. పొగాకు బోర్డు క్షేత్రస్థాయి సిబ్బంది రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

100 మంది విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ



విద్యార్థినులకు కళ్లద్దాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

సింగరాయకొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో టంగుటూరుకు చెందిన వినీల మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థినులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ దీరేందర్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులకు కంటి అద్దాలు ఉచితంగా అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధి రావూరి తిరుమల రాధాకృష్ణను అభినందించారు. డాక్టర్ చంద్రశేఖర్, రాజ్‌కుమార్, డాక్టర్ చైతన్య కృష్ణ, గోపి, సాయికృష్ణ, కుష్టువ్యాధి అధికారులు దామా వెంకటేశ్వర్లు, శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి



గాయపడ్డ హరికృష్ణ

సింగరాయకొండ: పాత కక్షల నేపథ్యంలో పాతసింగరాయకొండకు చెందిన కాకుమాను హరికృష్ణపై సోమరాజుపల్లి గ్రామానికి చెందిన మసనం వెంకట్రావు దాడి చేశాడు. స్థానికుల కథనం ప్రకారం హరికృష్ణ, వెంకట్రావులకు మధ్య పాతగొడవలు ఉన్నాయి. వీరిద్దరు సెంట్రింగ్ పనిచేస్తుంటారు. వారం రోజుల క్రితం మాలధారణలో ఉన్న వెంకట్రావుపై హరికృష్ణ దాడి చేసి కొట్టడంతో పాటు చొక్కా చించి మాల తెంచేశాడని స్థానికులు ఆరోపించారు. ఇది మనసులో పెట్టుకున్న వెంకట్రావు పకీరుపాలెం వద్ద కాపుకాసి మోటారు సైకిల్‌పై వచ్చిన హరికృష్ణపై ఇనుపరాడ్‌తో దాడి చేశాడు. ఈ క్రమంలో దాడి నుంచి తప్పించుకునేందుకు హరికృష్ణ పరిగెడుతూ బకరాల గుంట వద్దకు వెళ్లాడు. అక్కడ అతనిని వెంకట్రావు దాడి చేసి గాయపరచటంతో అతని కాలికి తీవ్ర గాయాలయ్యాయి. తరువాత వెంకట్రావు స్థానిక పోలీస్‌స్టేషన్ లో లొంగిపోయాడు. గాయపడిన హరికృష్ణను కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పాతకక్షలు ఉన్నాయని ఆస్పత్రి నుంచి రిపోర్టు వస్తే కేసు నమోదు చేస్తానని ఎస్సై బి. మహేంద్ర వివరించారు.